
పెద్దపల్లిలోని హనుమాన్‌నగర్ శివాలయంలో దర్శనానికి వచ్చిన భక్తులు


యైటింక్లయిన్‌కాలనీ: శ్రీనాగుల మల్లికార్జునస్వామి ఆలయంలో..


మంథని: పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులు


జూలపల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో..

శంభో మహాదేవ శంకర శివా

హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమఃశివాయ నామస్మరణలతో శివాలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున శివుడిని దర్శించుకునేందుకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు ఆలయాల ముందు బారులు తీరారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో బుధవారం భక్తులు పూజలు చేశారు. ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రభాతసేవ, ధ్వజారోహణం, అభిషేకం, బిల్వార్చన, క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, పల్లకిసేవ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. - సాక్షి నెట్‌వర్క్


జ్యోతినగర్: పూజలు చేస్తున్న అర్చకులు రుద్రభట్ల సత్యనారాయణ


శివాలయంలో పూజలు
సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


లింగానికి గోగు పూలతో పూజలు
సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


అంతర్గాం వద్ద గోదావరి ఒడ్డున శివలింగానికి పూజలు


ఫెర్టిలైజర్‌సిటీ: గౌతమినగర్ శివాలయంలో..


గోదావరిఖనిటౌన్: శివయ్య దర్శనానికి భక్తుల భారీ క్యూ


గోదావరిఖనిటౌన్: శివపార్వతుల కల్యాణం


సుల్తానాబాద్: నందీశ్వరునికి పూజలు


సుల్తానాబాద్ శివాలయంలో..


ఫెర్టిలైజర్‌సిటీ: శ్రీరాజరాజేశ్వర ఆలయంలో అభిషేకం


కమాన్‌పూర్: ఉత్సవ విగ్రహాలతో వస్తున్న భక్తులు


సుల్తానాబాద్: పూజల్లో పాల్గొన్న మహిళలు


యైటింక్లయిన్‌కాలనీ: కల్యాణంలో ఆర్జీ–2 జీఎం వెంకటయ్య దంపతులు


ముత్తారం: బహుగుళ్ల కోనేరు వద్ద స్నానాల కోసం భక్తుల రద్దీ


ఓదెల: ఉప్పరపల్లి శివగట్టు మల్లికార్జునస్వామికి పట్నాలు


గోదావరిఖనిటౌన్: పుణ్య స్నానాలకు వచ్చిన భక్తులు

క్లుప్తంగా

న్యాయశాఖ కార్యదర్శికి సన్మానం


సన్మానిస్తున్న వెంకటరమణారెడ్డి, సత్తయ్య

రామగిరి: రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి రేండ్ల తిరుపతి దంపతులు ఉదయం కల్వచర్ల ఉమ మహేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కల్యాణం వీక్షించారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక సత్తయ్య ఆధ్వర్యంలో తిరుపతి దంపతులను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు కొలిపాక సారయ్య, వీరవేన శ్రీనివాస్, బూస కనకయ్య, రాజుగౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

వైభవంగా నాగవెల్లి పట్నం



జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమల్లికార్జునస్వామి పట్నాలు, బోనాల్లో బుధవారం నాగవెల్లి పట్నం వేసి బోనాలు సమర్పించారు. ఒగ్గు పూజారులు నాగవెల్లి పట్నం వేయగా మహిళలు బోనాలతో శోభాయాత్రగా వచ్చి పట్నంపై పెట్టి నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించారు. అనంతరం అగ్నిగుండాల్లో నడిచారు.

శంకర దాసమయ్య ఉత్సవం

పెద్దపల్లిరూరల్: పట్టణంలో బుధవారం మేరు సంఘం ఆధ్వర్యంలో శంకర దాసమయ్య ఉత్సవాలు జరుపుకున్నారు. ఏటా శివరాత్రి పర్వదినం రోజున మేరు సంఘ నాయకులు ముత్యాల పోచమ్మ తల్లి ఆలయంలో తొలిపూజ నిర్వహించి పట్టణంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


జూలపల్లి: ఎన్నికల నిర్వహణకు వచ్చిన సిబ్బంది


మంథని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ కళాశాల పోలింగ్ సెంటర్లలో బుధవారం మున్సిపల్ సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభమై 4 గంటలకు ముగుస్తుందని వారు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎస్సై, హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

మంథని: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణకు బుధవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది సామగ్రితో చేరారు. మంథనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల కోసం ఒకటి, పట్టభద్రుల ఓటర్ల కోసం రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జూలపల్లి: టీచర్స్ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై సనత్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


ముత్తారం: ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేశ్, ఎస్సై నరేశ్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను ఎంపీడీవో సురేశ్, ఎస్సై నరేశ్ పరిశీలించారు. ముత్తారం జెడ్పీ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రి చేరింది. ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది ఒక పీవో, ఐదుగురు ఏపీవోలతో పాటు పోలీసు సిబ్బంది ఉంటారని తహసీల్దార్ బషీరొద్దీన్ తెలిపారు.

రిటైర్డ్ జీఎంలతో ఆర్జీ–1 జీఎం భేటీ


సమావేశమైన జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం పాటు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జీఎంలతో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ బుధవారం భేటీ అయ్యారు. సింగరేణికి సంబంధించిన అనుభవాలను వారితో పంచుకున్నారు. అనంతరం రిటైర్డ్ జీఎంలు ఎల్.భూమారెడ్డి, సాహెబ్ హుస్సేన్, జి.సుదర్శన్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటేశ్వర్‌రావు, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ రమేశ్, సర్వే అధికారి భాస్కర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

వేలాల జాతరకు ప్రత్యేక బస్సులు

గోదావరిఖనిటౌన్: మహా శివరాత్రి సందర్భంగా జైపూర్ మండలం వేలాలలో జరిగే జాతరకు ప్రత్యేక బస్సులు నడపుతున్నట్లు గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం తెలిపారు. బస్‌స్టేషన్ ఆవరణలో జాతర క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.50లుగా టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. స్త్రీలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో నాణ్యమైన మందులివ్వాలి

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కార్మిక కుటుంబాలకు నాణ్యమైన మందులు సరఫరా చేయాలని ఏఐటీయూసీ నాయకులు ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌ను కోరారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన స్ట్రక్చర్ సమావేశంలో పలు సమస్యలపై యాజమాన్యంతో మాట్లాడారు. ఎల్‌వన్ ప్రకారం కాకుండా కార్పొరేట్ టారిఫ్‌తో కూడిన నాణ్యమైన మందులు సరఫరా చేయాలన్నారు. జీడీకే–11గనిపై అంబులెన్స్ ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఏరియాలోని ఆర్వోప్లాంట్‌లకు వెంటనే మరమ్మతు నిర్వహించాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, స్వామి, రంగు శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్జీ–2 జీఎం వెంకటయ్య కోరారు. జీఎం కార్యాలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన సింగరేణి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. మార్చి 9 నుంచి 14 వరకు నిర్వహించనున్న శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వారంపాటు నిర్వహిస్తారని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు జగన్నాథచార్యులు, ఆర్జీ–2 ఎస్‌వోటూ జీఎం రాముడు, డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, సివిల్ ధనుంజయ్, ఈఈ మురళీకృష్ణ, వెంకటరమణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు చెందిన బుషణవేణి రాజయ్యగౌడ్ తాటిచెట్టు ఎక్కుతుండగా కాలు జారి కిందపడి గాయాలపాలయ్యాడు. స్థానికులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం రాజయ్యను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో చోరీ

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు 4నెట్ కేబుల్ వైర్లు, రెండు బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బీఎస్ఎన్ఎల్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి


కప్ అందజేస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయి స్థాయికి ఎదగాలని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అన్నారు. మండలంలోని గంగారంలో బుధవారం సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మూడు మండలాల స్థాయి క్రికెట్ కప్ పోటీల్లో గంగారం గ్రామానికి చెందిన టీం విన్నర్‌గా గెలిచింది. ఓదెల మండలం నాంసానిపల్లెకు చెందిన టీం రన్నర్‌గా నిలిచింది. విన్నర్ టీమ్‌కు రూ.పదివేల నగదు, ట్రోఫీ, రన్నర్ టీమ్‌కు రూ.5వేలు మాజీ ఎంపీపీ అందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ సర్పంచు ఈద సత్యనారాయణరెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, నాయకులు రఘు, మేడి అశోక్, బద్రి, క్రీడాకారులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం


పేదలకు నిత్యావసరాలు అందజేత

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ టీం సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని వక్తలు అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దాతల నుంచి సేకరించిన బియ్యంతో పాటు నిత్యావసరాలు బుధవారం మండల కేంద్రంలో అందజేశారు. వంద మంది నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యంతో పాటు 23రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు నారగోని సతీశ్‌గౌడ్, టీం సభ్యులు పాల్గొన్నారు.